క్లుప్తంగా

మెదక్‌లో బీజేపీదే గెలుపు



మాట్లాడుతున్న బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఆంజనేయులు

చేగుంట(తూప్రాన్): మెదక్ ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని దుబ్బాక నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం చేగుంటలో ఆయన మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ స్థానం బీజేపీ కైవసం చేసుకుంటుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గ ప్రజలు రఘునందన్‌రావుకే మొగ్గు చూపించారని పేర్కొన్నారు. మెదక్ బీజేపీ ఎంపీగా రఘునందన్‌రావు కచ్చితంగా పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్నారని ధీమా వ్యక్తం చేసారు. మెదక్ పార్లమెంట్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెజార్టీ ఓట్లు బీజేపీ సాధించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూపాల్, స్వామి, రవి తదితరులు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్దమ్మను దర్శించుకున్నారు. బీజేపీ నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు అతిథులను సన్మానించారు.

గెలుపుపై లెక్కలు



సునీతారెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

శివ్వంపేట(నర్సాపూర్): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిపోవడంతో గెలుపు అంచనాలు వేశారు. మంగళవారం గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని నియోజకవర్గంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కలిసి పోలింగ్ సరళిని వివరించారు. బూత్ స్థాయి నుంచి బీఆర్‌ఎస్‌కు పోలైన ఓట్ల గురించి చర్చించారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్‌రామిరెడ్డి గెలుపు ఖాయమని 100 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని అన్నారు. నియోజకవర్గంలోని నేతలు ఉన్నారు.

వృథాగా భగీరథ నీరు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ రోడ్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భగీరథ పైప్‌లైన్ పగిలింది. 200 మీటర్లకు పైగా నీరు ప్రవహిస్తుండంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అజంతా ఎక్స్‌ప్రెస్ ఆగేనా?

- మిర్జాపల్లిలో ఒకప్పుడు అన్ని ట్రైన్లు ఆగేవి..
- నేడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు





చిన్నశంకరంపేటలోని మిర్జాపల్లి రైల్వే స్టేషన్

చిన్నశంకరంపేట(మెదక్): మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో గతంలో అన్ని రైళ్లు ఆగేవి. కానీ ప్రస్తుతం అజంతా ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ అనేది అందని ద్రాక్షగానే మారింది. సికింద్రాబాద్ – నిజామాబాద్ రైల్వే మార్గంలో గతంలో ఎంతో చరిత్ర కలిగిన మిర్జాపల్లి రైల్వే స్టేషన్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం స్థానికులు తపనపడుతున్నారు. ఒకప్పుడు మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉండడంతో ప్రయాణికులకు రాకపోకలకు సౌకర్యంగా ఉండేది. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గతంలో మండలంలోని మిర్జాపల్లి రైల్వే స్టేషన్ సికింద్రాబాద్ – నిజామాబాద్ రైల్వే మార్గంలో సమాన దూరం ఉండడంతో పాటు ఇక్కడ రైల్వే రన్నింగ్ రూంతో పాటు రైళ్లకు అవసరమైన బొగ్గు, నీరు ఇక్కడ నింపుకునేవారు. దీంతో ఇక్కడ ప్రతీ ట్రైన్ ఆగడంతో ప్రయాణికులతో పాటు ఉద్యోగులతో కిటకిటలాడేది. రైల్వే ఉద్యోగులకు క్వార్టర్స్‌తో పాటు రన్నింగ్ రూం ద్వారా రైల్వే ఉద్యోగులకు విశ్రాంతి వసతి సౌకర్యం ఉండేది. అలాంటి మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో నేడు అనేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకుండానే దూసుకుపోతున్నాయి. దీంతో నగరాలకు వెళ్లే ఉద్యోగులకు, పుణ్యక్షేత్రాలకు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అజంతా ఎక్స్‌ప్రెస్, జైపూర్ ఎక్స్‌ప్రెస్, అజ్మీర్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ – నిజామాబాద్ మార్గంలో బొల్లారం, మిర్జాపల్లి, కామారెడ్డి మాత్రమే హాల్టింగ్ ఉండేవి. ప్రస్తుతం ఈ రైళ్లు మిర్జాపల్లిలో ఆగడంలేదు. మరో వైపు కొత్తగా వచ్చిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు మరికొన్ని వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు మిర్జాపల్లి రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తున్నా.. హాల్టింగ్ లేకపోవడంతో మిర్జాపల్లి గ్రామస్తులకు నిరాశపరుస్తున్నాయి.

నిర్లక్ష్యంగా అధికారులు...

అప్పటి జీఎం వినోద్ కుమార్ సికింద్రాబాద్ – నిజామాబాద్ రైల్వే మార్గంతో ప్రయాణిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమయంలో మిర్జాపల్లిలో అజంతా ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌తో పాటు అదనపు ప్లాట్ ఫారం, ఫుట్ వేర్ బ్రిడ్జి మంజూరు కోసం ప్రతిపాదనలు అందించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్, అదనపు ప్లాట్ ఫారం, ఫుట్‌వైర్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ అమలు చేయడం మరిచారు.

> **రైల్వే జీఎం స్పందించాలి**
>
> 
>
> మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్‌తో పాటు మరి కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగాలని గతంలో రైల్వే జీఎం వినోద్‌కుమార్‌ను కోరగా, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు రైల్వే అధికారులు ఏం చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో అజంత ఎక్స్‌ప్రెస్, రాయలసీమ, జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలి.
>
> – శ్రీనివాస్‌రెడ్డి, తాజామాజీ సర్పంచ్, మిర్జాపల్లి

గోమారంలో వైభవంగా మహాయాగం



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామంలో చతుర్వేత హవనం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 12 నుంచి 17 వరకు లోక కల్యాణం కోసం శ్రీ వేద మాత అనుగ్రహంతో చతుర్వేత హవనం చేపడుతున్నారు. పాలకుర్తి సుధాకర్ గౌతమ్‌శర్మ పర్యవేక్షణలో వేలేటి సిద్ధరామేశ్వర శర్మ ద్వివేది వైదిక నిర్వహణలో పూజ మహోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం చేపట్టిన పూజ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాధవారెడ్డి, నర్సింహరెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, ఎంపీటీసీ నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అర్చకులు శాస్త్రుల ఆయాధ్య రామశర్మ, చండీకశర్మలు ప్రముఖులను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వలసజీవులకు అడ్డాగా బస్టాండ్



బస్టాండ్‌లో వలసజీవులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రయాణప్రాంగణం వలస జీవులకు అడ్డాగా మారుతుంది. దీంతో ఎండవేడిమి నుంచి రక్షణ పొందడానికి ప్రయాణికులు రోడ్డు పక్కన ఉన్న చెట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఖరీఫ్, రబీ సీజన్ వచ్చిందంటే చాలు టార్పాలిన్‌లు కిరాయిలకు ఇచ్చే వలసవాదులు బస్టాండ్‌లోనే తాత్కాలికంగా నివాసముంటున్నారు. ఆరుబయట టార్పాలిన్‌లు ఉంచి ప్రయాణ ప్రాంగణంలోనే వంటావార్పులు చేసుకొని అక్కడే నిద్రిస్తున్నారు. ఫలితంగా వ్యవసాయ పనులు ముగిసే సమయంలో ప్రతిసారీ ప్రయాణికులు బస్టాండ్‌లో సేద తీరడానికి ఇబ్బందికరంగా మారుతుంది. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌లో ఇతరులు నివాసం ఉండకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

భగీరథుడి అడుగుజాడల్లో నడవాలి



రామాయంపేటలో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సగర సంఘం సభ్యులు



టేక్మాల్(మెదక్): వెంకటాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

రామాయంపేట(మెదక్): భగీరథ మహర్షి అడుగుజాడల్లో ప్రజలు నడవాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మర్కు దత్తు పేర్కొన్నారు. పట్టణంలో సగర సంఘం సభ్యులు మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, వివేకానంద, అంబేడ్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ వీలైనంతమేర సమాజసేవకు పాటు పడాలని, విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం చిత్తారమ్మ ఆలయంలో పూజలు చేశారు. సంఘం రెండు బేడల అధ్యక్షులు నాగభూషణం, మర్కు భూమయ్య, కోశాధికారులు సురేశ్, రామారపు రమేశ్, ఇతర సభ్యులు పెద్ద సిద్ధరాంలు, మర్కు బాల్‌రాజ్, మల్లేశం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో..

టేక్మాల్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మహర్షి భగీరథ మహారాజ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఉప్పర సంఘం ఆధ్వర్యంలో మహర్షి భగీరథ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇందులో ఉప్పర సగర సంఘం అధ్యక్షుడు సాయిలు సగర, కార్యదర్శి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ దరఖాస్తుల స్వీకరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బానో తు రాజన్న మంగళవారం తెలిపారు. ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు మొదటి దశ అడ్మిషన్లు కొనసాగుతాయని, అర్హత కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులున్నాయన్నారు. ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యాబోధన జరుగుతుందన్నారు.

ఓటింగ్‌లో మహిళలదే పైచేయి



మక్కరాజీపేటలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): పార్లమెంట్ ఎన్నికల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లు ఓటింగ్‌లో ముందున్నారు. సోమవారం మండలంలోని 38 పోలింగ్ బూత్‌ల్లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొని పురుషులకంటే ఎక్కువ ఓట్లు వేసి తమ సత్తా చూపించారు. 25,236 ఓట్లు పోలయ్యాయి. 12818 ఓట్లు మహిళలు వేయగా, 12418 ఓట్లను పురుషులు వేశారు. పురుషుల కంటే 400 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఓట్లు వేసి ప్రజాస్వామ్యంపై తమ నమ్మకాన్ని చాటుకున్నారని అధికారులు వారిని ప్రశంసించారు.

ప్రమాదభరితంగా ధాన్యం కుప్పలు



చిన్నగొట్టిముక్ల - జీడిపల్లి ప్రధాన రహదారిపై ధాన్యం రాశులు



మూలమలుపుల వద్ద ఆరబోసిన ధాన్యం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాన రహదారిపై వరి ధాన్యం కుప్పలు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని చిన్నగొట్టిముక్ల – జీడిపల్లి, నర్సాపూర్ – వెల్దుర్తి, తూప్రాన్ – వెల్దుర్తి ప్రధాన రహదారులపై పలు గ్రామాలకు చెందిన రైతులు ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ధాన్యం రాశుల కుప్పలు ఏర్పాటు చేసి, రాళ్లు పెట్టడం వల్ల పలు ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా ప్రమాదభరితంగా ఉన్న మూలమలుపుల వద్ద కుప్పలు ఉండడం వల్ల రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై కల్లాలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కౌడిపల్లిలో 84శాతం పోలింగ్



కన్నారంలో బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగిన ఎన్నికల్లో కౌడిపల్లి మండలంలో 84 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. మండలలో 29 గ్రామ పంచాయతీల్లో 39 పోలింగ్ బూత్‌లు ఉండగా 29,215 ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో 24,785 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వివరించారు. మండలంలోని నాగ్సాన్‌పల్లిలో 92.7శాతం ఓటు వేయగా, కన్నారంలో 74శాతం ఓటు వేశారు. జూన్ 4న ఓట్లు లెక్కింపు ఫలితాలు వెలువడనున్నాయి.

మండలంలో 77.76 శాతం పోలింగ్ నమోదు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో 77.76 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ గ్రేస్‌బాయి సోమవారం తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు 41 పోలింగ్ కేంద్రాల పరిధిలో 23,761 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 11,787 మంది మహిళలు, 11,974 మంది పురుషులు ఉన్నారు. మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల 2001–02 విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులతో తమ మధుర స్మృతులను ఒకరికొకరు పంచుకున్నారు. 20 ఏళ్లకు అందరు ఒక చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానించారు. సుధాకర్, రాజేశ్వరీ, భగవాన్, వెంకటరాములు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు



తగల బెడుతున్న వరికొయ్యలు

తీవ్ర నష్టం అంటున్న వ్యవసాయ అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామీణ ప్రాంతాల్లో పలువురు రైతులకు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై సరైన అవగాహన ఉండడం లేదు. దీంతో నష్టాన్ని కొనితెచ్చుకుంటున్నారు. రబీలో వరిని హార్వేస్టర్ ద్వారా కోయించిన రైతులు తాజాగా వానాకాలం పంటలకు సిద్ధమవుతున్నారు. కోత అనంతరం కొందరు గడ్డిని మోపులు కట్టుకొని నిల్వ చేసుకోగా, మరికొందరు పొలంలోనే కాల్చేస్తున్నారు. ఇలా గడ్డిని కాల్చేయడంతో అనేక నష్టాలు తప్పవని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

మంటతో భూసారానికి నష్టం..

వరి కోత తర్వాత పొలంలో ఉన్న కొయ్యకాలుకు, గడ్డికి నిప్పు పెట్టడం ద్వారా భూమిలో కర్బనశాతం తగ్గుతుంది. దీంతో మొక్కలకు అందాల్సిన పోషకాలు అందవు. కార్బన్‌లోనే మొక్కకు కావాల్సిన అన్ని పోషకాలు ఉంటాయని, ప్రస్తుత పద్ధతులు ఇలాగే కొనసాగితే రాబోయే 20 ఏళ్ల తర్వాత సాగు చేసే పంటలు తెగుళ్లను తట్టుకోలేవని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా నేల పైభాగంలో ఉన్న పంటలకు మేలు చేసే సూక్ష్మక్రిములు, కీటకాలు కూడా చనిపోతాయని, ఇది పంటలకు ఎనలేని నష్టం కలిగిస్తుందని చెబుతున్నారు.

వేస్ట్ డీ కంపోజర్‌తో ప్రయోజనం..

రైతులు నాటు వేసేముందు డీ కంపోజర్‌ను నీటిలో వదిలితే గడ్డి 20 రోజుల్లో కుళ్లిపోతుంది. రైతులు వరి గడ్డిని తగలబెట్టకుండా దుక్కి దున్నేటప్పుడు నీటితోపాటు డీ కంపోజర్‌ను వదిలి దున్నినా సరిపోతుంది. ఫలితంగా భూమి గుల్లబారి పోషకాలను విడుదల చేయడమే కాకుండా ఆయా పంటలు తెగుళ్లను తట్టుకుంటాయి. ఈ డీ–కంపోజర్ స్థానిక ఫర్టిలైజర్ షాపుల్లోకి రాలేదు. దీనిని ఆర్డర్‌పై తెప్పించుకోవచ్చు. రూ.100కు 5 బాటిళ్ల డీ–కంపోజర్ వస్తుంది. ఇది రెండెకరాల భూమికి సరిపోతుంది.

> **తీవ్రమైన వాతావరణ కాలుష్యం**
>
> రైతులు అవగాహన లేకుండా పంట కాలం పూర్తయ్యాక వరి గడ్డి, పత్తి, మక్క, మిర్చి కట్టెకు నిప్పుపెట్టడంతో అగ్నిప్రమాదాలు జరిగి అనేక రకాలుగా నష్టం వాటిల్లుతోంది. కొందరు రైతులు పొలానికి నిప్పు పెట్టి ఇంటికి వెళ్తారు. ఇది కాస్తా ఎంతోదూరం వ్యాపించి, ధాన్యపు రాశులు, గడ్డివాములు తగులబడుతుంటాయి. ఇదీ కాక తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. అందువల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పంట చేలకు నిప్పుపెట్టవద్దని అధికారులు సూచిస్తున్నారు.

ప్రభుత్వం మారినా.. ఫొటో మారలే

- మాజీ సీఎం ఫొటోతోనే 'కేసీఆర్ కిట్లు'అందజేత
- బాలింతలకు పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ
- తూప్రాన్‌లో చర్చనీయాంశం



కేసీఆర్ ఫొటోతో ఉన్న కిట్‌తో వెళ్తున్న బాలింత

తూప్రాన్: ప్రభుత్వం మారింది.. సీఎం మారాడు.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మారాడు.. కానీ ప్రభుత్వం మారిందన్న విషయాన్ని అధికారులు విస్మరించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రవసం అయిన బాలింతలకు అందించే కేసీఆర్ కిట్లను ఇంకా మాజీ సీఎం కేసీఆర్ ఫొటోతో పంపిణీ చేస్తున్నారు. తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి మార్పు లేకుండా పంపిణీ చేస్తున్న కేసీఆర్ కిట్ల పంపిణీ జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వం మారి ఐదు నెలలు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవమైన బాలింతలకు, శిశువులు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'కేసీఆర్ కిట్'పేరుతో సబ్బులు, నూనెలు, దోమతెర తదితర సామగ్రితో కూడిన కిట్ ప్రవేశపెట్టి అందజేసింది. అయితే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి చెంది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారి ఐదు నెలలు కావొస్తుంది. అయినా మాజీ సీఎం కేసీఆర్ ఫొటోతో కూడిన కిట్లను బాలింతలకు అందజేస్తున్నారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ పనితీరు ఏ మేరకు ఉందో స్పష్టమవుతుంది.

తూప్రాన్ సీహెచ్‌సీలో అందజేత

ప్రభుత్వం మారిన వెంటనే చర్యలు తీసుకోవాల్సిన వైద్య ఆరోగ్యశాఖ మొద్దునిద్ర విడకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలె పట్టణంలోని సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)లో పట్టణ పరిధిలోని హైదర్‌గూడకు చెందిన మౌనిక ప్రసవించింది. డిశ్చార్జి సమయంలో ఆస్పత్రి సిబ్బంది ఆమెకు కేసీఆర్ కిట్‌ను అందించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **స్టిక్కర్లు అతికిస్తున్నాం**
>
> ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి గతంలో 400 కేసీఆర్ కిట్లు పంపిణీ జరిగాయి. ఇంకా 70 కిట్ల వరకు మిగిలి ఉన్నాయి. కిట్లపైన కేసీఆర్ ఫొటోపైన స్టిక్కర్లు అతికించి బాలింతలకు పంపిణీ చేస్తున్నాం. కొందరు స్టిక్కర్లు తొలగించి తీసుకెళ్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ నుంచి నూతనంగా కిట్లు పంపిణీ జరగలేదు.
>
> – అమర్‌సింగ్, సీహెచ్‌సీ సూపరిడెంట్, తూప్రాన్